"జగన్నాటకం"

శ్రీమతి 'హృదయిని'

ఆ రాత్రి మా యింటికి దగ్గరేఉన్న గరల్సు హైస్కూలులో క్రొత్తగావచ్చిన నాటక కంపెనీ వారు ఒక నాటకం ప్రదర్శిస్తారని తెలిసింది. మాలతి యింటికి వెళ్ళాను. మాలతిలో మార్పేమీ లేదు. ఆమె పలుచని పెదవులమీది ఆ విషాద శబలతా మిశ్రితహాసం ఆమెను వదలిపోలేదు.

'మాలతీ! ఈ రాత్రి మా యింటి దగ్గర ఒక నాటకం ఆడతారట. నీవు తప్పకుండా నాతోపాటు రావాలి ఆ నాటకానికి.'

'అనూ! నేనెందుకు? నీవే వెళ్ళిరా!'

'అలా కాదు మాలతీ! నీవిలా చెపుతావని నాకు తెలుసు. చూడు—ఇద్దరంకలిసి పూర్వం సినిమాలకు, డ్రామాలకు వెళ్ళివచ్చేవాళ్ళం. నీవా పాడు ఆశ్రమం నుంచి వచ్చినప్పటినుంచి వెనకటి మా మాలతివి కావు. ఒక సినిమా లేదు! ఒక డ్రామా లేదు!'

ఆమె ఒక చిర్నగవు నవ్వింది! 'అనూ! ఈ సినిమాలూ - డ్రామాలూ నన్ను వెనకటి మాలతిని చేస్తవి అంటావా!'

'ఎందుకు చేయవు! నీవీ విధంగా ఉదాసీనంగా ఎంతకాలమని గడుపుతావు?'

'ఉదాసీనతా! నేనిప్పుడేం ఉదాసీనంగా ఉన్నాను!'

'అయితే నీవీరాత్రి నాతోపాటు నాటకానికి వస్తావుగదా!'

'వస్తాలే అనూ! మా నాన్ననుగూడ పిలువు.'

ఆమెలో హృదయపూర్వకమైన ఉత్సాహం లేదని నాకు తెలుసు. కాని ఆమె యిట్లాయినా మెల్లగా వెనకటి చిర్నగవులు చిందుతుండే మాలతి అవుతానికి నాంది అగుతుందని మనసులో అనుకొన్నా.

మాలతినాన్న సత్యనారాయణబాబుకూడా నాటకానికి రావడానికి సమ్మతించారు. మాలతి నాటకానికి రావడానికి ఒప్పుకొన్నదని నేచెప్పినప్పుడు అతని కళ్ళలో ఆనంద సూచనా రేఖలు చలించినవి. ఆశ్రమంనుంచి మాలతిని తీసుకొచ్చి ఆరు నెలలయింది. కాని ఆమెను ఆవరించిన హృద్రోగం - విషాదం ఏమీ తగ్గలేదు. ఆమె బయటికే రావటం లేదు. పలకరించితే ఏదో నిరాశామయ మందహాసంతో సమాధానమిస్తుంది. ఆమెకూడ నాటకానికి వస్తానన్నదని చెప్పటంతో ఆ వృద్ధునికెంతో ఆనందం కలిగింది.

మా యింటి ప్రక్కని గరల్సు స్కూలు ఆవరణలోనే స్టేజీ అంతా సిద్ధంచేసిఉంది. రాత్రి 8½ గంట అయింది. అప్పటికే జనం చాలామంది స్టేజీముందు కూర్చుని ఉన్నారు. ప్రేక్షకులు కూర్చునే చోటును రెండు భాగాలుచేసి ఒకవైపు పురుషులకు రెండవ వైపు స్త్రీలకు నిర్దేశింపబడింది. మధ్యభాగం చిన్న త్రోవగా స్టేజీదగ్గరకు పోవటానికి వీలుగా విడచి ఉంది.

స్టేజీకి దగ్గరగా, మాలతీ, నేనూ స్త్రీల మూడవ వరుసలో కూర్చున్నాం. మాలతీనాన్న తన స్నేహితుల దగ్గర కూర్చున్నాడు. పురుష ప్రేక్షకులలో కొందరు ధూమావృత మేఘాలను సృష్టిస్తున్నారు. కొందరు ఏవో ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. మరి కొందరు నాటకం ఎప్పుడు ఆరంభిస్తారా అని ఉత్కంఠతో వేగన్నులతో ఎదురు చూస్తున్నారు. స్టేజీపైన కట్టిఉన్న లౌడ్‌స్పీకర్లనుంచి ఏవో సినిమా పాటలు పాడుతున్నవి. ఇంకా తెర దించేఉంది.

పాట లాగిపోయినయి. 'మహాజనులారా! నమస్కారం. కొద్ది క్షణాల్లో మా సరిక్రొత్త నాటకం - 'జగన్నాటకం' క్రొత్త నట నటీ వర్గంతో తయారు చేసింది ప్రదర్శించబోతున్నాం. మీ రంతా నిశ్శబ్దంగా - శ్రద్ధగా నాటకాన్ని చూస్తారని మా ప్రార్థన!'

వీణ, ఫిడేలు, హార్మోనియంల స్వరసమ్మేళనంతో సంధ్యాసమయాన్ని సూచించే రాగం ఆరంభ మయింది. ప్రేక్షకులంతా శ్రద్ధతో నాటకరంగం ముందున్న తెర ఎప్పుడు పైకి లేస్తుందా అని ఉత్సాహంతో నిరీక్షిస్తున్నారు. మాలతీ కోమల హస్తాన్ని నా చేతిలో ఉంచుకొని నాటకాన్ని చూడమన్నట్లుగా ఆమెనుద్దేశించాను.

తెర లేచింది. అది ఒక పుష్పవాటిక. ప్రశాంత సంధ్యాసమయం. ఒక తిన్నెమీద ఒక యువపరివ్రాజకుడు. ఆయన పాదాల చెంతనే ఒక అందమయిన పదారేళ్ళమ్మాయి. ఆ అమ్మాయి ఆ తరుణ సన్యాసి ముఖాన్ని ఆప్యాయంగ చూస్తూఉంది.

అతడు:—"లతా! నేను కనుపించకపోతే నీ వెందుకిలా వెఱ్ఱిదానివిలా అయిపోతావు. ఆశ్రమానికి మోక్షసాధనానికై వచ్చి హృదయపూర్వకంగా తాపసవృత్తి స్వీకారంచేసిన మనలో ఈ నూతన పరిణామం ఎందుకు గలిగింది?"

ఆమె:—"బ్రహ్మచారీ! నాకేమి తెలుసు ఆశ్రమంలోని వేదాంతోపన్యాసములు! గురుబోధలు వింటూన్నంతసేపు ఏదో లీలగా అర్థమవుతయి. నా చెవులు మాత్రం స్వామిజీ బోధలు వింటుంటయి. నా కన్నులు చాటుగా మిమ్మలను చూడ్డానికి పరుగులిడుతుంటయి. మనసు మీ ధ్యానంతోనే నిండి ఉంటుంది.

అతడు:—'నీవు పుట్టిందెక్కడో! నేను పుట్టిందెక్కడో! ఇద్దరం యీ ఆశ్రమంలో కలుసుకొన్నాము. ప్రార్థనామందిరంలో ఆశ్రమవాసులంతా చేరుతున్నప్పుడు ఆనాడు మిగతా భక్త మహిళలతో నీవు రావటం తలవని తలంపుగా చూచాను. ఆ ఘడియ ...'

ఆమె:—'ఆ మధుర ఘడియే! నా హృదయంలో స్నేహ పిపాసను పుట్టించింది. అప్పటికి పది రోజులయింది, నేనాశ్రమంలో చేరి. మీ నిర్మలమైన చూపులు ఆ మధురమైన ఘడియనుంచే నన్ను ఇలా చేసినయి. పూర్వ జన్మలో మీతో ఏదో నాకు గాఢ స్నేహం ఉన్నట్లు భావిస్తూ వచ్చాను.'

అతడు:—'లతా! నా హృదయంలోని స్థితీ నీలాగే ... ప్రార్థనా మందిరంలో నీవు రావటం కొంచెం ఆలస్యమయితే, ఏదో పోగొట్టుకున్నట్లు నీకై ద్వారంవైపు నా కళ్లు దొంగతనంగా - పిచ్చిగా - పరుగులెత్తుతయి. అప్పుడు లోపలి కెవరు ప్రవేశిస్తున్నా నీవేనని తోచేది. ఆనా అనుచితమైన పనికి నాలో నేను వితర్కించుకొనే వాడిని - లత లేకపోతే ఇంత అతృప్తి ఎందుకు నీకు?' అని

ఆమె:—'బ్రహ్మచారీ! ప్రతి సాయంత్రం మీరు విహారానికై పావుకోళ్లు వేసికొని వెళుతుంటే, ఆ చప్పుడువిని మెల్లగా నా పాదాలు కదిలేవి. మీ అడుగుల్లో అడుగులేసికొని మిమ్మల్ని అనుసరించాలని బయలుదేరేదాన్ని. కాని ఆశ్రమ విధులు నన్ను కట్టివేశాయి.

అతడు:—'లతా! ఇది ఒకరకమైన పిచ్చి!'

ఆమె:—'ఏమో బ్రహ్మచారీ నాకేమీ తెలియదు. మీరు సంధ్యా సమయంలో ఈ తిన్నెమీద కూర్చున్నప్పుడు - సూర్య కిరణాలు మీ ముఖము, వక్షస్థలముమీద ప్రకాశిస్తున్నప్పుడు - చిరుగాలి మీ అలకలతో ఆటలాడుకొంటున్నప్పుడు ఈ విధంగ మీ చరణాలచెంత కూర్చునాలని నా హృదయం ఎందుకో ఉవ్విళ్లూరుతుంది.'

అతడు:_'లతా! నీ విశాల హృదయంలో ఈ అభాగ్య సన్యాసికింత చోటిచ్చావా! ... నా ధ్యానంతో నీకేమి ఒరుగుతుంది?

ఆమె:_'ఏమో బ్రహ్మచారీ! నాకేమీ తెలియదు.'

అతడు:_'అవును వేదాంత చర్చలను, యోగశ్లోకాలను విపులంగా అర్థంచేసికొనే నేను నాలో వ్యాపించిన ఈ పరివర్తనాన్ని అర్థంచేసుకోలేక పోతున్నానుగదా!'

ఇంతలో ఒక పరివ్రాజకుడువస్తూ ఒక పూలచెట్టు వెనక నిలబడిపోయాడు. చెవులు నిక్కించి ఆ జంట మాటలను వినసాగాడు.

ఆమె:_'బ్రహ్మచారీ! ఈ ప్రపంచంలో స్త్రీ పురుష భేదంతో సృష్టి ఎందుకు జరిగిందో నాకర్థం కావటంలేదు. వారిద్దరిమధ్య ఏదో అర్థంకాని ఒక బంధం వ్యాపించి ఒకరికోసం వేరొకరు తపించటం - ఇవి నా చిన్ని మనసుకు కగమ్యంగా ఉన్నాయి. ఇది సృష్టిలోని ఒక తప్పని సరియైన సహజస్థితి యేమోనని తోస్తుంది!'

అతడు:_'లతా, నా తలిదండ్రులు గతింపగా కల్లోలిత హృదయంతో ఈ యాశ్రమానికి వచ్చాను. దృఢమానసంతో సాధనచేస్తూవచ్చాను. ఇప్పుడది ప్రేమసాధనగా మారింది. నాలో పూర్వదృఢ మనశ్శక్తిలేదు. వేషమూ సన్యాస స్వీకారాన్ని తెలుపుతుంది! హృదయమూ నీ స్నేహానందంతో నిండిఉంది! 'లోకాన్ని పవిత్ర సన్యాసవేషంతో మోసగిస్తున్నావు మాధవా' అని నా మనసు తిరుగుబాటు చేస్తూంటుంది.'

ఆమె:_'నేనూ అప్పుడప్పుడిదే స్థితికి లోనవుతుంటాను బ్రహ్మచారీ!'

అతడు:_'లతా! గురూజీకి మన స్థితిని నివేదిస్తామని అనుకుంటున్నాను. కాని ...'

ప్రక్క పూలచెట్టు కదులుతుంది. అక్కడ నిలబడిన పరివ్రాజకుడు వెనుదిరిగిపోయాడు.

ఆమె:_'కాని ... ఏమి ఆగారు?'

అతడు:_'ఏమీలేదు. మనమిద్దరం కలుసుకోటం, రోజు రోజుకు పెరుగుతున్న స్నేహాన్ని కనిపెట్టి మన సోదర శిష్యుఁడు, సుబుద్ధి గురూజీకి నివేదించాడు ఈ మధ్య. వెంటనే గురూజీ నన్ను పిలచారు - మాధవా! నా శిష్యుల్లో నిన్నెంతో ఉత్తమునిగా భావిస్తున్నాను. నా తర్వాత ఆశ్రమాధికారిని చేయాలనుకుంటున్నా. కాని, నీవు లతతో ఏకాంత సంభాషణ చేస్తున్నావట! - అని ప్రస్తావించారు. కాని ఆ సమయంలో గురూజీ ఆగ్రహాన్నిచూచి మనసులోని నిరంతర విప్లవాన్ని వివరంగా తెలిపి మన యిద్దరికి గృహస్థాశ్రమం ప్రసాదించమని వేడుకోటానికి జంకాను. లతా! నీవీ దరిద్ర భిక్షువుని పెండ్లి చేసుకుంటావా?'

మా మాలతివైపు చూచాను నేను. ఆమె కనులందు అర్థంకాని అశ్రుబిందువులు ఆ లైట్ల వెలుగులో చూచాను. ఆమెలో విస్మయాతిరేకము, హర్షాతిరేకము పెనవేసికొని ఉన్నాయి. ఇది ఒక్క క్షణంలోచూచి, వెంటనే నాటకంమీదకు నా దృష్టి మరల్చాను. ఆ ముగ్ధ సుందరి యిలా సమాధానమిచ్చింది—

'బ్రహ్మచారీ! మీరు నా హృదయాన్ని అర్థం చేసుకోనికూడా యిలా ప్రశ్నిస్తారేమిటీ? నన్ను మీకెప్పుడో అర్పణచేసుకొన్నాను, స్వచ్ఛమైన యీ సూర్య కిరణాల సాక్షిగా.'

'లతా!' - అని అతడామె కోమలకరాన్ని తన చేతిలోనికి తీసుకొన్నాడు ప్రమోదంతో.

'నాతో మొదట మీరు మాట్లాడకుండా ఉన్నప్పుడు నాకెంతో భయమేసింది. సముద్రంలోని తరంగాలవలె నా ప్రేమ నాలోనే లీనం చేసుకోవాల్సి వస్తుందేమో అని!'

అప్పుడు వెనుక పూలమొక్క చాటున కొంచెము సేపు నిలబడి పోయిన సన్యాసి, జడధారి, జప

మాలాధారి అయిన యింకొక ప్రౌఢసన్యాసి, గురూజీ లాగున్నాడు ఒక పూల పొదవెనుకకు వచ్చి నిలబడ్డారు.

అతడు:—'లతా! నాహృదయం, శరీరం - అంతా నీవే. పవిత్రమైన జగద్బాంధవుడి అరుణ కిరణాలు చూడు. ఆ పక్షిబృందాన్ని చూడు. తమ గూళ్ళ కొబోలు ఎలా వెళుతున్నయ్యో! అటు చూడు! వాటిలో ఒక జంట - సతీపతులు కాబోలు ఊహ్వేత్తుగా, ఉల్లాసంగా గాలిలో తేలిపోతున్నయి!

ఆమె ఆబ్రహ్మచారి చరణాలను స్పృశించుతూ, ఆయన కళ్ళకేసి అలాగా తనివిదీర చూస్తూ ఉండి పోయింది!

అతడు:—'లతా,'

ఆమె:—'ఆఁ!'

నేను వారిద్దరి నిష్కళంకమైన ప్రేమచే సంచలిత మనస్వినయ్యాను. మాలతి స్థితి ఎలా ఉందా అని ఆమెవైపు చూచాను. ఆమె నయనాల వెంట అశ్రు బిందువులు రాలుతూ ఆమె నునుచెక్కులను ఆర్ద్రిం చేసినయి. ఆమె అధరాలు కంపిస్తున్నయి! నేను చూడటం చూచి, నాచేతులను తనచేతుల్లోకి తీసి కొని 'అనూ'! అని ఆత్రముగా పలకరించింది! ఏదో చెప్పబోయి ఆగిపోయింది! మరుక్షణమే యిద్దరమూ నాటకంవైపు ధ్యానం మరల్చాం. నేపథ్యంలో ఒక మగగొంతు, ఆడగొంతు కల్సి పాడుతున్న గాగం ఆరంభమైంది. ఆరాగానికి అనుసరణగా హార్మోనియం, ఫిడేలు స్వరాల్ని పలుకుతున్నయి.

అతడు:—'లతా' ఆ పాటవిను! ఎవరో మనలాంటి ప్రేమికుల్లా ఉండి పాడుతున్నారు!

"రాణీ! ఓ ... రా ... ణీ ...!
రాజా! నా .. రా ... జా ...!
రాణీ ... ...!
ఈ చిరుగాలిలో ఈ తెలిసోకిలో,
ఈదుకుంటూ పోదామే!
ఈ చిన్ని పడవెందుకే ...!
వద్దునాసామీ! లోతైన ఏటిది!
ఈదలేక మునిగి పోతా మిద్దరమూ!
ఈ అలలపైనే తేలిపోయే
మనప్రేమ పడవుండగా ... రాజా!
రాణీ!!
రాజా!!"

అని ఆనేపథ్యగీతం శ్రావ్యంగా ఆరెండు గొంతుకలు పాడటం పూర్తఅయింది.

అతడు:—'లతా! నడువు ఆశ్రమానికి. ప్రార్థనా సమయమయింది. సోదర శిష్యులు సిద్ధంగా ఉంటారు, మందిరంలో గురూజీ నాకోసం ఎదురు చూస్తూంటారు

పూలపొద చాటునుంచి ఆ ప్రౌఢసన్యాసి ఒక్కసారిగా లతామాధవుల ముందుకు వచ్చి నిల బడ్డాడు. శిష్యుడుగూడా ఆతడి వెనుకనే వచ్చాడు.

ప్రౌఢసన్యాసి:—'మాధవా! గురూజీ నీరాకకై ఎదురు చూస్తూంటారా! నీ కృత్రిమ పరివ్రాజక వేషం! నీ ఏకాంత ప్రేమాలాపనలు! నీ నిజ స్వరూపం నేటికి ప్రత్యక్షమయింది. లతతో మాట్లాడేది వేదాంత చర్చయని చెప్పి, ఇదా నీవాడుతున్న నాటకం! కపటీ!'

హఠాత్సంభూత సంఘటన కులికిపడి ఆ లతా మాధవులు లేచి నిలబడ్డారు.

మాధవుడు:—'స్వామీజీ! మీ...'

ప్రౌఢ:— 'చాలు. స్వామీజీయట! ఎంతవాడివెలా మారిపోయావు! నీ మీద నాకున్న ఆశలన్ని భగ్న మయిపోయినయి. ఆశ్రమానికి ఎంత అప్రతిష్ఠ తెస్తానికి సిద్ధమయ్యావు?'

మాధ:_లేదు. గురూజీ!

ప్రౌఢ.-మాధవ్! చాలించు. ఇక నీమాటలు విన నవసరంలేదు. ఎంత దౌర్భాగ్యుడవయ్యావు! సంధ్యాసమయ విహారానికై బయలుదేరేది ప్రియ సమాగమ ప్రాప్తికా! ఛీ...పతితుడా!

మాధ:-స్వామీజీ వినండి. మీరన్నట్లు ఈలతకు నాకు ప్రేమాను బంధం ఉన్నమాట నిజమే. మా యిద్దరిమనసుల్లో చెలరేగుతున్న నిరంతర విప్లవాన్ని మీకు నివేదించ......

ప్రౌఢ:-నివేదనా, నిర్వేదనా! నాపవిత్రాశ్రమానికి మాయని కళంకం తేవటానికి సిద్ధమయిన నీవూ నీ మాటలూ -

మాధ:- 'వినండి స్వామీ. నేనూ లతమీదకలిగిన ప్రేమను తలంచుకొని మనసులో చాలా ఖేదపడుతూ వచ్చాను. ఆశ్రమవాసం చేస్తూ - సన్యాస స్వీకారం చేసి బ్రహ్మజ్ఞాన సాధన చేస్తూన్న నాకిది అర్హమైంది కాదని ... కాని నాయువహృదయంలో లతాస్నేహం అశాంతిగా ఉండేది ఈ నిరంతర మానసిక కల్లోలాన్ని మీకు నివేదించి, మాయిద్దరికి గృహస్థాశ్రమంను ప్రసాదించి ఈ ఆశ్రమవనిలోనే ఒక చిన్న కుటీరంను అనుగ్రహించి ప్రార్థించదలచాను. సమయం లభించక మీకు తెలుపలేక పోయా నీవిషయ్యం_అదే నా దోషం'

ప్రౌఢ:_మాధవా! ఏమిటీ నీవు చెప్పేది! గృహస్థులకా ఈ ఆశ్రమంలో స్థానం! చాలించు నీ ప్రలాపం

మాధ:-స్వామీజీ!

ప్రౌఢ:- 'మాధవా! ఈ ఆశ్రమం యోగసాధనా వైరాగ్య నిష్ఠాపరులకేగాని మందభాగ్యులయిన గృహస్థులకు స్థానం కాదు. ప్రథమదోషంగా భావించి మన్నిస్తున్నా. ఇంక నీవు లతతో సంభాషించకూడదు - కలుసుకొనకూడదు. తెలిసిందా! చేసిన దోషానికి శిక్షగా ఈవారం దినాలు ఇద్దరికి ఉపవాసదీక్ష విధిస్తున్నాను. నడు ఆశ్రమానికి (వెంటనున్న శిష్యునిచూచి) సుబుద్ధీ! లతను ఆశ్రమానికి తీసుకురా.'

(సశేషము)

ఏజంట్లు కావాలి!

రాజమహేంద్రవరం, హైదరాబాద్, సికిందరాబాద్, ఒంగోలు, కడప, తిరుపతి — యింకా యితర ప్రదేశాలలో మాపత్రికలు అమ్మబడని చోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్ముటకు - ఏజంట్లుగా నున్నవారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.

అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం

రాయపేట, మద్రాసు-14